కథానిక:



# అభ్యాగతులు

శ్రీ వి. సచ్చిదానందశర్మ

"ఊఁ...అప్పుడు వాళ్లేంచేశారు?" అన్నాడు విశ్వనాథం ఉండబట్టలేక, వాసు సంభాషణ రసపట్టులో ఆపుచేసి తిండిధోరణిలో పడేసరికి.

సుందర్రావు, నేను, శ్రీరామ్మూర్తి, నాగభూషణం...అంతా సరైనప్రశ్న వేశావన్నట్టు సమాధానం కోసం వాసువైపు నోరుతెరుచుకు చూస్తున్నాం. విశ్వనాథం ఆప్రశ్న వేసి ఉండక పోతే మాలో ఎవరైనా అదే ప్రశ్న వేసిఉండే వాళ్ళం. అసలు, వాసు ఎంత చమత్కారి కాక పోతే విషయాన్ని అంత క్లైమాక్సులో వదులుతాడు? అందుకనే తరుచు అంటూ ఉంటాం: "వాసూ! అదృష్టవశాత్తు ఏదో ఒక వాని గ్రహబలం తక్కువై నువ్విలా ఉన్నావుకాని, కాకపోతే కర్మం కాలి నువ్వో గొప్ప రచయితవయేవాడివిరా" అని!

అట్లు తయారయి వచ్చే లోపల కాలక్షేపానికి తెప్పించిన పకోడీలు ఎంగిలిపడ్డాం. శ్రీరామ్మూర్తి నాలికతో నోటిని శుభ్రంచేసుకుంటున్నాడు. నాగభూషణం గబుక్కుమని ఒక తేపు తేపాడు. ఇంతలో సర్వరు పళ్ళాలు ఒకదానిమీద ఒకటి దొంతరగా అమర్చుకొచ్చి మాటేబులు ముందు ఠపీమని ఆగి "క్లీన్"అని అరిచాడు కీచు గొంతుకతో. బల్లలు తుడిచేవాడికి వీలుగా సుందర్రావు ఒకవైపుకు ఒదిగాడు. సర్వరు పళ్ళాలన్నీ అందరిముందూ అమర్చి వెళ్ళిపోయాడు. వాసు ఒకగ్లాసు మంచినీళ్ళతో పూర్వాధ్యాయానికి భరతవాక్యం, నూతనాధ్యాయానికి నాందీ పాడాడు.

"ఆ తరవాత ఏమయిందో చెప్పావు కావు..." అని జ్ఞాపకం చేశాడు నాగభూషణం.

"ఆ! ఎంతవరకు చెప్పాను?" అన్నాడు వాసు, ఆ విషయాలన్నీ తిండి అడుగున పడి పోయినట్టు.

"బిల్లు ఎవరి కందితే వాళ్ళిసాం. కింద పడెయ్యమన్నారు; సర్వరు పడేశాడు— అంతవరకు."

"ఇంకేముంది! ఇద్దరూ కుర్చీలమీంచి దూకారు—ఆబిల్లు నేనిస్తానంటే నేనిస్తానని! అలా వాళ్ళిదరూ ఎంగిలాకులమీదికి కుక్కల్లాగా బిల్లుమీదికి ఎగబడుతుంటే సర్వరు అవతలగా నిలబడి కుస్తీపందెం చూస్తున్నట్టు కులాసాగా చూస్తున్నాడు. చివరికి ఆ హేమాహేమీల్లో ఒకడు బిల్లు పుచ్చుకుని కౌంటరు ముందుకి నడిచాడు. రెండోవాడు కూడా లేచి నిలబడి కౌంటరుదగ్గిరికి పోతున్నవాడి కండువాపుచ్చుకుని వెనక్కిలాగుతూ 'యహే! నేనిస్తానండుడబ్బు' అంటున్నాడు. కౌంటరుదగ్గర మాత్రం ఎంత వాంగామా అయింది? అందులో ఎవడూ డబ్బివ్వడు; రెండోవాణ్ణి ఇవ్వనివ్వడు! హోటల్లో కూర్చున్నవాళ్ళంతా ఆ పల్లెటూరి మర్యాదలు వినోదంగా చూశారు. ఇంతకూ ఎవరు డబ్బివ్వటమనే విషయం ఏ వేళకూ తేలక పోయేసరికి మానేజరుకి ఒళ్ళు మండి 'ఎప్పుడూ హోటలుకి వచ్చిన మొహాలల్లే లేవే!' అని తిట్లకి లంకించుకున్నాడు. ఆనాలుగూ పడింతరవాత అందులో ఒకడు తగ్గి రెండోవాణ్ణి బిల్లు చెల్లించ నిచ్చాడు. అంతా అయిపోయి మెట్లు దిగుతూకూడా ఇదే సంభాషణ—డబ్బు నే నిచ్చేవాణ్ణంటే నే నిచ్చేవాణ్ణని! ఈ వధవ మర్యాదలు చూచే సరికి నా కొకటనిపించింది— ఇలా నే నిస్తానంటే నే నిస్తానంటున్నవాళ్ళు కాస్తా, ను వ్వియ్యమంటే ను వ్వియ్యమనటానికి ఎన్నోరోజులు పట్టదనుకున్నాను!"

ఇక్కడ మీ రొక్క విషయం గమనించాలి: వాసు రియలిస్టు కాకపోయినట్లయితే వాళ్ళిద్దరూ అంతవరకు హోటలుమొహం చూడని పల్లెటూరి మనుష్యులని చెప్పే శ్రద్ధ తీసుకుని ఉండేవాడు కాదు. అంతే కాదు—ఇప్పుడుచెప్పిన విషయాన్నే ఇంకా బిలవలు పలవలుగా అల్లి... వాళ్ళు బిల్లుకోసం తల్లులాడు కోవటంలో బల్లమీద ఉన్న కప్పులు పగలకొట్టారనీ, మరికొన్ని కప్పుల్లోఉన్న కాఫీ తింటున్నవాళ్ళమీద ఒలికిందనీ, వాళ్లూ, మానేజరూ... అంతాపోగై ఇద్దరినీ తలొక నాలుగూ ఉతికి తిన్న డబ్బులు కక్కించి మరీ బయటికి పంపారనీ—ఇలా తన సామర్థ్యం కొద్దీ ఊహాగానంచేసి ఉండేవాడు. ఇంకా నేను మాపార్వతిగాడి విషయం గట్టిగా చెప్పలేనుకాని, వాసు మాత్రం అంత తెలివితక్కువవాడు కాడు.

ఈలోగా మేము అట్టుతో మాడవపట్టుగా కాస్త ఉప్మాకూడా నంజుకుని కాఫీ దాహం పుచ్చుకుంటున్నాం. సర్వరునోటి లెక్కని బిల్లు తయారు చెయ్యటానికి సతమత మౌతున్నాడు. నేను గబగబా వేడివేడి కాఫీ గొంతులో పోసుకుని చెయ్యి కడుక్కోటానికి అవతలికి వెళ్ళాను. ఈలోగా ప్రతివాళ్లూ గ్లాసులు కిందపెట్టి బయలుదేరారు. నేను మళ్ళా నా కుర్చీ దగ్గిరికి చేరుకునేసరికి వాసు నొచ్చుకుంటున్నట్టు, "ఛా! పాపం. ఇవ్వాళకూడా సుందర్రావునే బిల్లుబగవుమొయ్యమనటం దారుణం!" అన్నాడు వేడివేడి కాఫీ ఊదుకుంటూ తాగుతున్న సుందర్రావు చేతికి సర్వరు బిల్లు అందించేసరికి.

"ఆ బిల్లిలా తేవోయ్!" అంటూ సుందర్రావు చేతులోనుంచి బిల్లు అందుకోబోయాడు శ్రీరామ్మూర్తి.

"అయిందీ! ఇందాకటినుంచీ నే వినిపించిన నాటకమంతా ఇప్పుడు మళ్లీ మీ రొకసారి ఆడేట్టున్నారే! కానియ్యండి...ఇదో కాలక్షేపం!"అని అందర్నీ నవ్వించాడు వాసు ఒకసారి. ఒక క్షణం ఆగి మళ్ళీ "అపాటి కాస్త లౌక్యమన్నా తెలీకపోతే ఎలారా? కాఫీ అంతసేపు తాగితే బిల్లు మీదపడక ఏ మౌతుంది?" అన్నాడు మర్మం లేకుండా.

"అహఁ...అంత మాత్రానికే ఫరవాలేదులేరా!" అని తన అమాయకతని బుజువుపర్చుకున్నాడు సుందర్రావు.

అంతా బయలుదేరాం. సుందర్రావు లాగూ జేబులోకి చెయ్యి పోనిస్తూ కౌంటరుముందు ఆగిపోయాడు. మేమంతా గుమ్మం దిగి రోడ్డు ప్రక్కన నిలబడ్డాం. ఇంతలో శ్రీ రామ్మూర్తి ఒక ఉదాత్తభావాన్ని వెల్లడిస్తూన్నట్టు, "అస్మదాదులందరికీ - నెలలో చేతికి డబ్బొచ్చిన మొదటివారంఅంతా అర్థికసమృద్ధి; రెండోవారంఅంతా సాధారణ ఆర్థిక పరిస్థితులు; మూడోవారం ఆర్థికమాంద్యం; నాలుగోవారం క్షామం!" అన్నాడు.

మాలో ఈ విషయాన్ని కాదనగలవాడు ఎవడూ లేడు కాకపోతే నెలలో మొదటి వారంలోమాత్రం అర్థికసమృద్ధితో ఉన్నవాడెవ డని విచారించేవాళ్లే కాని, ఉన్న విషయాన్ని గోరంతలు కొండంతలుచేసి చెపుతున్నాడని అనతగ్గవాళ్ళం ఎవరమూ కాము. అందువల్ల ఎవరిమటుకు వాళ్ళం బాగా చెప్పావన్నట్టు విని ఊరుకున్నాం.

ఇంతలో విశ్వనాథం అందుకుని "పార్వతిగాడు నీ మాటలు విని ఉంటే వెంటనే పీక పట్టుకునేవాడు. 'నెల మొదటివారంలోనైనా అర్థిక సమృద్ధిగా ఉండగా ఎన్నడైనా నన్ను చూశావా? ఎందుకు వెధవగొప్పలు?' అని" అన్నాడు.

"అన్నట్టు నిన్నా, ఇవ్వాళ్ళా పార్వతి అయిపే లేడేం? ఏమైనట్టు?" అన్నాడు నాగభూషణం.

"మరేం భయంలా...ఇందాక నేవాడు, వెంకటశాస్త్రి కలిసి కనిపించారు. ఊళ్ళోనే ఉన్నాడు!" అన్నాడు వాసు పార్వతినిగురించి అంత ఆశ్చర్యం అనవసర మన్నట్టు.

పార్వతీశం, వాసులమధ్య ఒక విధమైన ఈర్ష్య మొదటినుంచీ ఉంటూనే ఉంది. దానికి కారణం వాళ్లిద్దరికీ చాలా విషయాల్లో పోలిక ఉండటం అనుకుంటాను. మిగతా విషయాలన్నీ అలా ఉంచి చమత్కారంగా మాట్లాడటంలో ఒకణ్ణి మించినవాడు ఒకడు. అందువల్ల మాటల్లో ఒకణ్ణి ఒకడు చితుచెయ్యాలనీ ఇద్దరూ ప్రయత్నించేవాళ్లు. ఈ ప్రత్యర్థిభావం వాళ్లిద్దరి మధ్యా ఉండటం గమనించి మాపార్కు సమావేశాల్లో వాళ్ళిద్దరినీ ఉసికొలిపి అంతా వింటూ కూర్చునేవాళ్లం.

"వెంకటశాస్త్రికూడా నిన్న పార్కుకి రాలేదు కదూ?" అన్నాడు సుందర్రావు

"ఉఁహుఁ..." అన్నాడు నాగభూషణం.

"వాళ్ళేదో చాలా హడావిడిగా తిరుగుతున్నారోయ్! ఏదో వుంది.. పార్కుకి వచ్చేందుకు వ్యవధి చిక్కటం లేదేమో! ఈ ఉన్న నలుగురిలోనూ ఎన్ని క్లిక్కులు!" అన్నాడు వాసు.

మాటలుసందట్లో తెలియకుండానే పార్కు చేరుకున్నాం. మేము రోజూ కూర్చునేచోటుకి మలుపు తిరగగానే "అడుగో పార్వతి!" అన్నాడు శ్రీరామ్మూర్తి అంత దూరాన్నుంచే గుర్తుపట్టి.

పార్వతి వంచిన తల ఎత్తకుండా ఏదో పరిశీగా చూస్తూన్నాడు. క్రమంగా దగ్గిరకి వచ్చి చూతుముకదా డబ్బు! కొన్ని నోట్లు, కొన్ని రూపాయలు, కొంత చిల్లర...అంతా లెక్కపెట్టుకుంటున్నాడు!

పార్వతిగాణ్ణి అలా అంత డబ్బుతో చూచేసరికి మాలో ప్రతి ఒక్కరం నిర్ఘాంతపోయాం. పైగా అది నెలచివరివారం. సాధారణంగా ప్రతివాళ్లూ - అందులో ముఖ్యంగా పార్వతి - ఎంత తగ్గించి చెప్పాలన్నా, నిస్సందేహంగా "క్షామం"తో బాధపడవలసిన కాలం! అలాంటిది వాడు అంత పచ్చగా కనబడితే ఎవరికళ్లు కుట్టవు?

పార్వతి డబ్బు లెక్కపెట్టటం పూర్తిచేసి, పర్సులో చిందరవందరగా కుక్కేసుకుంటూ "హోరి వీడిదుంప తెగా!" అన్నాడు తెల్లమొహంపెట్టి.

వాసు పర్సులో కుక్కుతున్న నోట్లపై పొకసారి చూసి "ఇంకేం? రెండురోజులనుంచీ వీడు ఊరికే కనపడకండా ఉండటంలే దన్నమాట! అసలిప్పుడు వీడు వెంకటశాస్త్రికోసం ఎదురు చూస్తున్నాడేమో నట్రా!" అని అంటించాడు.

పార్వతి ఇంకా అలాగే మొహం వేళ్లాడేసి చూస్తుండేసరికి "వెంకటశాస్త్రి రాలేదేరా?" అన్నాను.

పార్వతి కాస్సేపటికి తెప్పిరిల్లి ఒకసారి గుటక మింగి "ఇంకెందు కొస్తాడు? అరి వీడిదుంపతెగ! ఇందు కన్నమాట...ఆదరాబాదరా జారుకున్నాడు!" అన్నాడు నోరు వెళ్లబెట్టి ఇందాకటిమాదిరిగానే.

నేను మాత్రం ఇవాళ కాలక్షేపం బాగానే జరుగుతుం దని తాపీగా కూర్చున్నాను.

పార్వతి ఏ వేళకీ తెమిల్చి చెప్పకండా ఇంకా అలాగే చూస్తూండేసరికి శ్రీరామ్మూర్తి "ఏం జరిగిందో చెప్పరా! ఏమిటలా తెల్లమొహం వేసుకు చూస్తావ్? ఏమైం దేమిటి?" అన్నాడు.

"డబ్బేమైనా కాజేశాడేరా?" అన్నాడు నాగభూషణం.

పార్వతి నెమ్మదిగా కోలుకుని "పూర్తిగా కాజెయ్యటం కాదనుకో...చివరికి డబ్బాపోయె, శనీ పట్టె నని - పెట్టి పోషిస్తున్నదాతలాగా ఎన్నితిట్టాడురా! వీడిమొహం తగలెయ్య!" అన్నాడు.

పార్వతి ఉన్న విషయ మేదో సరిగా చెప్పకుండా నాన్చుతున్నా కాని వాసు నాలుగు వినురుల్లు విసరకండా ఊరికే కూర్చోటం మా అందరికీ ఆశ్చర్యం కలిగించింది. వాడివైపొకసారి చూశాను. ఇంకా అలాగే కూర్చుని ఉన్నాడు తాపీగా.

పార్వతి మాటలధోరణి పూర్తిగా ఎరుగున్న మాకు వీ డేదో సస్పెన్సుకోసం అహోరిస్తున్నాడని అప్పుడే తెలిసిపోయింది. అందువల్ల, "ఒరే అబ్బీ! నీ యీ వెధవ్వేషాలు మాని ఉన్నవిషయ మేదో ముక్కుకి సూటిగా చెప్పావా చెప్పు; లేకపోతే నోరు మూసుక్కూచో. అంతే కాని, అన్యాయంగా మా ప్రాణాలు తియ్యక. మాట్లాడుకోవటానికి అనేక విషయా లున్నాయి" అని ఒక ఘాటైన మోతా దిచ్చాను.

"అబ్బే, సస్పెన్సూ లేదు; పాడూ లేదూ - అసలు నేను మాట్లాడితేనే మీ కనుమానం! హోటల్లో టిఫిన్ తీసుకుంటున్నంతసేపూ ఎన్ని మాటలన్నాడురా! తల్చుకుంటే కడుపుతరుక్కుపోతుంది..." గానుగ ఎద్దులాగా అదే విషయం చుట్టూ మళ్లీ ఒకచుట్టు తిరిగాడు పార్వతి.

మాలో ప్రతివాడికీ పార్వతిగాడి విషయం వినాలనే కుతూహలం అసహనంగా మారిపోయింది. ఈ లెక్కని ఆ విషయం విప్పిచెప్పటానికి ఆ సాయంకాలం అంతా మింగెయ్యాలని ప్రయత్నిస్తున్నాడని గ్రహించి ఒక సరైన మార్గంలో ఉన్న విషయ మేదో చెప్పేట్లు చేస్తేనే కాని లాభం లేదని, "ఒరే పార్వతీ! నువ్వు అట్టే ఈ డొంకతిరుగుడు వ్యవహారం మాని, నేను అడిగే ప్రశ్నలకి సమాధానాలుమాత్రం చెప్పు చాలు." అన్నాను.

"ఏమిటి?" అన్నాడు.

"నువ్వు ఇంటిదగ్గిర్నించి ఎప్పుడు బయల్దేరావు?"

"అదే, ఓ గంటా, గంటన్నర అవుతుంది."

"సరే, నీకు వెంకటశాస్త్రి ఎక్కడ కనపడ్డాడు?"

"నేను సందుమలుపు తిరిగేసరికి ఎదురయాడు. 'నీకోసమే వస్తున్నారా' అన్నాడు. 'సరే, అయితే పద' అని ఇద్దరం బజారుకు బయలుదేరాం" అన్నాడు పార్వతి.

ఇక సంభాషణ దారి తప్పకుండానడుస్తుందని "ఊఁ...ఇద్దరూ బజారుకి బయలుదేరారు - అక్కడినుంచీ జరిగిన విషయం జరిగినట్టు వరసాగ్గా చెప్పకురా" అన్నాను.

పార్వతి తన చిత్తం వచ్చినట్టు చెప్పకు పోవటానికి వీలులేకుండా బిగించానని గ్రహించి ఒక వెకిలి నవ్వు నవ్వి ప్రారంభించాడు: "సరే, బజారుకని బయలుదేరాం. నే నప్పుడే గ్రహించాను వెంకటశాస్త్రి మా యింటికి వస్తున్నాడంటే తగుమైన కారణం ఉండి ఉండకపోదని.


"'ఏరా! ఇలా ఎదురు బయల్దేరావు?' అన్నాను మళ్లీ.

"'అబ్బే! మరేం లేదురా' అన్నాడు ఇందాకటి మాదిరిగానే.

"ఇంతలో హోటలు సమీపించేసరికి కాళ్లల్లో సత్తువ జారిపోతోంది. 'ఏరా! కడుపు కాఫీ కావాలంటోంది కాదురా?' అన్నాను. వెంటనే వాడుమాత్రం తక్కువవాడా?—'పర్సు డబ్బు లేవంటోందిరా!' అన్నాడు.

"'అలా చెప్పు! మరి ఊరికే వచ్చావనంటావేరా?' అన్నాను.

(16-వ పేజీ చూడుడు)



# టిటో

'శిష్టా'

యుగోస్లావియా దేశము శాంతికిగాని, సంకట యుద్ధానికిగాని ఆరంభ ప్రదేశము కావచ్చును. ఈ దేశానికి పశ్చిమాన నౌకాశ్రయాలైన అనేక ఓడరేవులు గలిగిన తీరమున్నది. తూర్పున భూమయం మాత్రమే గోచరించే సోవియట్ రష్యా వున్నది. మధ్యన తిష్ఠవేశాడు టిటో - ప్రజ్ఞాపరుడు, అప్రమత్తుడు, పూర్వంలో కమ్యూనిస్టు ఏజెంటు!

టిటోనుగురించి అనేకులు అనేకరీతులుగా, ముఖ్యంగా వామపక్ష పత్రికల వారు, రచించారు. మలినపు ఇజార్లు తొడుగుకుని, బొడ్డున కైజారుతో, కొండకనుమలలోంచి, పశ్చిమ శివాజీవలే, ప్రతిపంథిసైన్యాలపై దాడిదుమికి యుగోస్లావియాను రక్షించాడన్నారు. కొంతవరకు నిజమే - కల్పనకూడా కొంత లేకపోలేదు.

జోసిప్ బ్రాజ్ - టిటో యుగోస్లావియాకు మార్షల్. జాతీయ స్వతంత్రతా సైన్యానికి ముఖ్యాధిపతి. కమ్యూనిస్టుపార్టీకి సెక్రటరీ - జనరల్. గతించిన అమెరికాధ్యక్షుడు రూజువెల్టు మాదిరిగా ఇతనివద్దగూడ గొప్ప ఆకర్షణ శక్తి ఉన్నది.

ఇతనిని గురించి ప్రచారానికి ప్రకటించే బొమ్మలకునూ తీరుకునూ ఇతని అసలు తీరుకునూ చాల వ్యత్యాసమున్నది. ప్రచారానికి వదిలే బొమ్మలలో ఇతని ముఖమెప్పుడూ కనుబొమలు చిట్లించి భీకరంగా వున్నట్లు అగుపిస్తుంది. నిజానికి ఇతను నవ్వుతనం ఎక్కువ గలవాడు. ఓసారి ఫీల్డింగు అనే ఒక అమెరికా మేజరు ఇతనితో భోజనానికి పోయి కుర్చీమీద కూర్చుంటుండంగా కుర్చీ వొరిగి ఆయన నేలమీద బోర్లపడ్డాడు. అది చూచి టిటో పకపకా ప్రక్కలను పట్టుకొని నవ్వాడు.

టిటో సన్యాసివంటి జీవితం గడపడంలేదు. చక్కగా విందారగిస్తాడు. అతిథి సత్కారం చెయ్యడంలో కోటీశ్వరుడల్లే చేస్తాడు. దుస్తులను మాత్రం అభేషజంగా ధరిస్తాడు.

ఇతని ప్రక్కన ఎప్పుడూ ఇతని మొదటి భార్య "ఓల్గా నిన్సిచ్" ఉంటూ ఇతనికి తెలియదన్న ఇంగ్లీషు మాటా డేవారున్నప్పుడు తర్జుమా చేస్తుంది.

రెండవ భార్య కిసాను పడుచు - ఇతని ముఖ్యకార్యస్థానంలో సామాన్యంగా ఉంటూ ఉండదు.

ఇతనికి ఇంగ్లీషు అసలు రాకపోలేదు. రానట్లు నటన ఎక్కువ.

జోసిప్ బ్రాజ్ - టిటో క్రోషియాలో జన్మించాడు. ఇతని తండ్రి వడ్రంగి. ఇతని తల్లి రైతుబిడ్డ. 1914 సంవత్సరంలో ఆస్ట్రో-హంగేరి సైన్యంలోకి ఇతన్ని అధికారులు లాగారు. త్వరలోనే ఇతను రష్యను సైన్యాల వైపుకు వెళ్ళిపోయాడు. అక్కడైనా, జ్వారు చక్రవర్తి పక్షమున పోరాడడానికి ఇతను విముఖత్వం చూపగానే ఇతన్ని సైబీరియా దేశాంతరవాసం వేశారు. 1907 సం॥లో బోల్షివిక్కులు ఇతనిని వదిలించారు. ఆలగాయతు మూడు వర్షాలు టిటో విప్లవవిద్యను విధేయంగా నేర్చుకున్నాడు.

1920 నుంచి 1923 వరకూ టిటో మాస్కోలోని "అతిరహస్య పశ్చిమ పాఠశాల"లో అనేకవిధ్వంసక విధానాలను నేర్చుకున్నాడు. ఇక్కడ విదేశాలలో రహస్యకార్యక్రమాలను ఎట్లు జరపాలనో నేర్పుతారు. ఇక్కడ ఆరితేరిన తరువాత ఇతను స్వదేశమైన క్రోటియాకు తిరిగి వెళ్లాడు. అచ్చట రైల్వేలోహయంత్రశాలా కార్మికవర్గంలో చేరి అనేక హడావుళ్లను చేస్తుండగా అధికారులీయనను జైలులో వేశారు. అయిదుసంవత్సరాలు కారాగారవాసమైన తర్వాత షుమారు ముప్పది మూడవయేట బయటపడ్డాడు గాని ఆరుమూడైనా సరే కమ్యూనిస్టులకు విరోధులైనవారు నాశమైపోవాలనే పట్టుదలతో తయారయాడు. ప్రచ్ఛన్నవాసంలోకి దిగి కమ్యూనిస్టు కార్యక్రమంలో కదురై నిలిచాడు. ఆనాటినుంచే అతనిని "టిటో" అని ప్రజలు పిలువ నారంభించారు.

హిట్లరు యుగోస్లావియాపై 1941 సంవత్సరాన ఏప్రిలు 6 తేదీలో దాడి యెత్తాడు. దండుదారుల నెదుర్కొనడానికి యుగోస్లావియాలో అనేకులు తయారయారు ప్రయాణీకుల వేషాలతో అనేకమంది టిటో అనుచరులు దేశము ప్రవేశించారు. కమ్యూనిజమును గురించి ఎక్కువ మాటాడకుండా జాతీయత పేరును రేగగొట్టుచూ యీ అనుచరుల కృషికి ఫలితంగా టిటోపక్షము దేశంలో బలపడ్డది. అది చూచి అప్పటిదాకా మిఖాలోవిచ్‌కు మద్దతిస్తున్న ఇంగ్లాండుగూడా టిటోకే సాయపడ్డది. తొమ్మిది మాసాల తర్వాత అమెరికా గూడా టిటోకే చేయూతనిచ్చింది.

1943 సంవత్సరము నవంబరు 29 తేదీ యుగోస్లావియా స్వాతంత్ర్య దినంగా ఎంచబడింది. తదనుకూలంగా టిటో డిక్టేటరయాడు. ఇతను డిక్టేటరయిన యుగోస్లావియా రిపబ్లిక్‌లో, వెయ్యి సంవత్సరాల యీమధ్య మొదటిమాటుగా క్రోటులు, సర్బులు, స్లోవీనులు, బోస్నియనులు, మాసిడోనియనులు, మాన్టినీగ్రియన్లు అనే ఆరు రకాల జాతులవారు ఒకే అధికారానికి లోబడినారు. ఈ రిపబ్లిక్ విస్తీర్ణము 96,000 చదరపు మైళ్లు. ఈదేశాన్ని టిటో లోహముష్టితో ఏలినప్పటికీ సర్వశక్తి విధాలా అనేక అభ్యుదయకరమైన మార్పులను గూడ తెచ్చినాడని ఒప్పుకోక తప్పదు.

పెద్ద ఎస్టేట్లు మాయమైపోయి చిన్న చిన్న ఫారములు తయారయాయి. వీటిని స్వతంత్ర రైతులే అనుభవిస్తున్నారుగాని సాముదాయక వ్యవసాయాన్ని అమలులోనికి తేలేదు. కాని ఇట్టి రైతులతోబాటు సహకార వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టిన కారణాన దేశము ఆహార విషయంలో స్వయంపోషకత్వం కలగగలిగి మిగులును గూడ చూపగలిగింది. ఈ మిగుళ్లతో టిటో దేశపరిశ్రమలకు కావలసిన ఉన్నత యంత్రసామగ్రిని కొనగలిగాడు. "అన్రా" సామగ్రిగూడా ఇతనికి తోడయింది. ఇందుచే విశాలమైన విద్యుచ్ఛక్తి నుత్పత్తిచేసే కర్మాగారాన్ని నెలకొల్పాడు. అనేకమైన నూతన రహదారులను నిర్మాణించాడు. ఈ నిర్మాణ కార్యక్రమాల వల్ల టిటో తాను రష్యనులమీదికి దృష్టి మరల్చడముకన్న పశ్చిమ రాజ్యాలవైపుకే చూడడం మంచిదనుకున్నాడు.

కాపిటలిస్టు దేశాలయిన స్విట్జర్లాండు ఇటలీలతో వ్యాపారపు టొడంబడికలను కుదుర్చుకున్నాడు. ఒకమూల రష్యాను సంతోషింపజేయడానికై ఇంగ్లాండును తిడుతూ అవసరానికి వెనుదీయకుండా ఇంగ్లాండుకు కొయ్యసామగ్రికి బదిలీగా ఇనుపసామగ్రిని అందజేశాడు.

టిటో రష్యాను పొగడుతూ ఆ పొగడికలను అస్తమానం దేశజనులమీద రుద్దుతూన్నా, పశ్చిమరాజ్యాలను తీవ్రంగా విమర్శిస్తూ తిడుతున్నా రష్యాకు ఇతనిమీది ప్రేమ తగ్గిపోతూన్నది.

ఆగ్నేయ ఐరోపాదేశంలో చాలకాలం నుంచి యుగోస్లావియా నాయకత్వం వహిస్తున్నది. ఇది రష్యాకు ఇష్టంలేదు. ఏది జరిగినా ముందు రష్యాతో సంప్రతించలేదని వారి కినుక. ఇదిగాక ఒకవేళ బాల్కను అంతా ఒక ఫెడరేషను అయి కొంచెం హెచ్చుతగ్గుగా రష్యాకే ఎదురుమోడి వేసే బలిష్ఠత కలగడంగూడా రష్యాకు ఇష్టంలేని పని.

బాల్కను ఫెడరేషను నిర్మాణ విషయంలో బల్గేరియా డిక్టేటరయిన డిమిట్రొవు మొదట తల వూచినా రష్యావారి డొక్కపోట్లకు తాళలేక ఆ విషయంలో తన మాటలను తానే గద్రిమింగుకున్నాడు. అతని మాదిరిగా గాక టిటో నిలబడడంతో రష్యాకంటిలో నలకగా తేలాడు.

టిటోయొక్క అదృష్టం ఎటు మారితే అటు జాతకచక్రాలు మారే అతని ముఖ్యానుచరులు ముగ్గురున్నారు.

40 సంవత్సరాల యీడుగల రాన్కొవిచ్ ఒకడు. ఒకప్పుడితడు దర్జీక్రింద కూలి చేసేవాడు. ఇప్పుడితను అంతరంగిక మంత్రి. దేశమందలి క్రమపద్ధతిని సక్రమంగా నడిపించుటయితని ముఖ్యకార్యక్రమం. ఇట్లు చేయుటలో బల్గేరిడు రాజధానిలో నివసిస్తున్న రష్యనులపై గూఢచారులను నియోగించాడనే నేరం ఆరోపిస్తారు కోమిన్‌ఫారంవారు.

టిటో పక్షమునను అతని పార్టీ పక్షమునను ప్రచారముచేయుటకు నియమింపబడినవాడు డిజిలాసు అనేవాడు. ఇతని భార్యపై టిటో మక్కువ చూపుతున్నాడని కొందరంటారు. ఆవిడ ధరించే రత్నాభరణాలు అతను కానుకగా యిచ్చినవే అంటారు.

మూడవవాడు కార్డెజీ. ఇతను విదేశాలలోనూ ముఖ్యంగా యూనోలోనూ కృషి చేస్తూంటాడు.

టిటోతోబాటు యీ ముగ్గురూ గూడా కోమిన్‌ఫారంవారి ఆగ్రహానికి అనగా రష్యా ఆగ్రహానికి లోబడినవారే. ముఖ్యంగా టిటో యీమధ్య పశ్చిమదేశాలవారితో ఏర్పరచుకున్న వాణిజ్య ఒడంబడికలు కమ్యూనిస్టు దేశాలవారికి సిగ్గుబాటయిన విషయం. దీనిని పురస్కరించుకొనియే రుమేనియా మంత్రి టిటోను జ్యూడాసు (క్రైస్తును పూర్వకాలంలో మోసగించినవాడు) అని పిలిచాడు. ఈ విధంగా కోమిన్‌ఫారంవారు అనేకయత్నాలు చేస్తున్నారు. వాటికి ఎదురెత్తులెత్తుతున్నాడు టిటో.

ఇదంతా చూస్తే యుగోస్లావియా ముందు రాబోయే యుద్ధానికి మూలకారణమౌతుందా అనిపిస్తుంది. ఈ దేశానికి పడమట తీరాన అనేక నౌకాశ్రయాలు పశ్చిమరాజ్యాల యుద్ధనౌకలకాశ్రయం ఇవ్వగలుగుతాయి. తూర్పువైపున భూమి ఆధారంగా విశాలరాజ్యమైన సోవియట్ రష్యా ఉన్నది. మధ్యన ఉన్నాడు టిటో నిశ్చింత చూపుతూ, నిమిషాలు లెక్కిస్తూ, నివురుగప్పిన నిప్పుమాదిరిగా!

---

# అభ్యాగతులు

(11-వ పేజీ తరువాయి)

" 'నీదగ్గర డబ్బులుంటే సరే సరి. లేకపోతే మరి ఊరికే వచ్చినట్టేగా!' అన్నాడు దిగాలుపడి. "అదృష్టవశాత్తు నిండుగా ఉన్న నా పర్సు వాడి స్థితి చూసి జాలిపడ్డది. పాపం, నిన్ననల్లా హోటలుఖర్చుకి వాడి కొవ్వేనాయెకాలింది! అంత తిని ఒక్కసారి ఎలా మరిచిపోగలను? అందుకని, 'ఫరవా లేదులేరా! నా పర్సుడబ్బుకి భయంలేదు; కడుపులి కింత మేత పడెయ్యండంటోంది. నడు, లోపలికి' అన్నాను.

"వెంకటశాస్త్రి మొహం చాటంత అయింది. బుజమ్మీదిగా చెయ్యి పోనిచ్చి గుండెమీద కొట్టి 'చంపావుపోరా! ఇంత శుభవార్తని ఇంత నెమ్మదిగానుట్రా చెప్పేది? నడూ...లోపలికి!' అన్నాడు హడావిడిగా."

పార్వతి మా అందరివైపు ఒకసారి చూశాడు. తను సంభాషణ అతిగా పొడిగిస్తున్నందువల్ల మేమంతా నీరసంగా వింటున్నట్లు గ్రహించి సంభాషణక్రమం మార్చవలసిన అవసరం గుర్తించాడు.

అప్పటికే ఓపిక తగ్గిన నాగభూషణం, "నీకో నమస్కారం. మామీద దయుంచి జరిగిందేదో ఒక్కగుక్కలో చెప్పు - చివరికి బిల్లును వ్వు చెల్లించావు. అంతేనా?" అన్నాడు. నాగభూషణం ఈ మాటలనటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అసలీ మాటలు ఇందాక మా బిల్లు చెల్లించిన సుందర్రావు సగర్వంగా అని వుండవలసింది. లేకపోతే ఏకాస్త సమయం దొరికినా పార్వతిగాణ్ణి కాకి పొడిచినట్టు పొడిచేవాడు అన్నా అర్థం ఉండేది. అసలు' వాసు మౌనంగా కూర్చోటం ఈ సంభాషణ రక్తి కట్టకపోవటానికి ముఖ్యకారణం అనుకున్నాను.

ఇంతలో పార్వతి "ఛా! అది కాదురా విషయం. వెధవ కాఫీ బిల్లులుకి అంత మొహమొహాలూ చూసుకుంటా ననుకున్నావేరా?" అని చురుకుగా సంభాషణ ప్రారంభించాడు: "కొందరు మనుష్యులికి అదో వెధవలక్షణ మనుకుంటాను - హోటల్లో కూర్చున్నదగ్గరనుంచీ నా తిండినిగురించే వాడి వెటకారం. 'ఇంత తింటావు, అంత తింటావు,' 'మరో పట్టు పట్టు,' 'లగాయించు' - ఇదీ వెధవపదజాలం! ఏదో ఒకసారి రెండుసార్లంటే నవ్వులాటకని ఊరుకో వచ్చునుకాని, తింటున్నంతసేపూ అలా ఆడిపోసుకుంటుంటే ఎలా సహించటం? అందుకనే వాడితో హోటలుకి వెళ్లటమంటే నాకు వెడ్డ అసహ్యం. అందులో నాదగ్గర పెబ్బులు లేకపోతే కాఫీ మానుకుని తలనొప్పితోనన్నా బాధపడతానుకాని, వాడి మాటలు భరించలేను.

"అసలు ఇవాళ్లయినా ఈ పెం. వదిలించుకునేవాణ్నే! కానీ, వాడిదగ్గర ఎలాగో డబ్బులు లేవంటున్నాడుకదా; నేను బిల్లు చెల్లిస్తానని చెపితినికదా ఇవ్వాళ్లన్నా నోరు మూసుకుని కూచోకపోతాడా అనుకున్నాను. ఊఁ...హు... వాడెందు కూరుకుంటాడు? పూర్వంకన్నా రెచ్చిపోయాడు! చిఱుబుస్సుల్తో సర్వర్లని హడలగొట్టేస్తున్నాడు. వీడి జోరు చూసి వీ డెవడో పైలాపచ్చీసుగాడులా ఉన్నాడని ప్రతివాళ్లూ వింతగా చూస్తున్నారు. నిజానికి, వాడి ప్రవర్తన నాకే తమాషాగా కనబడ్డది. ఇంత హంగామా చేసి, ఆనక బిల్లు చెల్లించేటప్పుడు తెల్లమతాబా కాల్చటానికి ఎలా మొహం చెల్లుతుందా అని ఆశ్చర్యపోతున్నాను. సర్వరు వచ్చేలోపల నాలుగుసార్లు పిలిచాడు. మానేజర్ని రెండుసార్లు గదమాయించాడు.

"మానేజరు తిట్లకి బెదురుతూ వచ్చి నిలబడ్డ సర్వరును రెండు బోండా తీసుకురమ్మన్నాడు. వాడు బోండా కొంచెం ఆలస్యమౌతుందనేసరికి మరింత విసుక్కుంటూ 'అయిందీ! అడుగులో హంసపాదా? సరే అయితే, ఏమున్నాయో చెప్పు' అని వాడిచేత ఒక దండకం చదివించాడు.

"చివరికి చదివిన వన్నీ ఏమీ వినిపించుకోనట్లు 'సరే, అదంతా ఎందుక్కానీ, వేడిగా, రడీగా ఏముందో చెప్పు, చాలు!' అన్నాడు.

" 'మైసూర్ బజ్జీ'

" 'అచ్ఛా! రెండు మైసూర్ బజ్జీ తీసుకురా' సర్వరు పరుగెత్తుతుంటేసరికి వాణ్ణి పిలిచి 'ఇదుగో! ఏమిటలా వెళ్లిపోతావ్? రెండు మసాలాదోసెకూడా చెప్పు త్వరగా' అన్నాడు. సర్వరు 'మసాలాదోశె రెండు' అని బిగ్గరగా లోపలికి వినబడేలాగ అరుచుకుంటూ బజ్జీ తేవటానికి వెళ్లాడు. బజ్జీ తెచ్చిన వాణ్ణి ఖాళీగా ఉంచటం ఇష్టంలేనట్లు 'స్వీట్సు ఏమున్నాయ్?' అన్నాడు. వాడు 'మైసూర్ పాక్, లడ్డూ, జహాంగీర్...' స్వస్తి మొదలుపెట్టాడు. వెంకటశాస్త్రిగాడు 'రెండు జహాంగీర్' అన్నాడు ధీమాగా.

"ఇక నేను వాణ్ణి కాస్త అపుచేస్తేనే కాని లాభం లేదని 'ఇంక నాకేమీ ఒద్దురా. కావలిస్తే నువ్వు తీసుకోరా జహాంగీర్...ఏయ్! ఒకటే జహాంగీర్' అన్నాను సర్వరుతో. వెంటనే వెంకటశాస్త్రి 'వోరే! వెధవభేషజం పోకరా... మహాచక్కగా తినగలవ్! ఎందుకీ వెధవబెట్టు? నీ కెందుకు నేనున్నాగా. ఊఁ...కొట్టెయ్!' అన్నాడు.

"అప్పటికప్పుడే సర్వరు నా మాటలు వినిపించుకోకుండా రెండు జహాంగీర్లు తీసుకు రావటానికి అవతలికి వెళ్లాడు. చుట్టూ ఉన్న ప్రతివాళ్లూ నేనేదో పీడిమీద పడి తేరగా తినటానికి వచ్చి బెట్టుపోతున్నానని నావంక వెకిలిగా చూడటం గమనించాను. నాస్థితి చూస్తే నాకే జాలిగా వుంది.

"మరీ వద్దు వద్దంటే బాగుండదని మెదలకుండా తినటం మొదలుపెట్టాను. ఇకచూడండి వాడి ధోరణి!-'ఇలాటి సమయాల్లో కూడా ఇలా నెమ్మదిగా తింటే ఎలారా? ఊఁ...కొంచెం పెద్ద పడిలో పోనీ; మరేమీ లేక పోయినా కాస్త త్వరగా తినటమన్నా నేర్చుకోరా!'- ఈవరసని ప్రారంభించాడు!

"నాకు తిక్క రేసతోంది. ఆ కోపంలో ఎంగిలి పళ్లాలు ఎత్తి వాడి మొహాన కొడతానేమోనని భయపడ్డాను. కాని, తమాయించుకొని ఇంత హడావిడి చేస్తున్న వెధివాయ్ తెల్లమొహం వేసుకు చూస్తుంటే, మనం బిల్లు చెల్లించామంటే తెలిసిపోదా వీడి బండారంఅంతా, అని వాడనే మాటలన్నీ దిగమింగి ఊరుకున్నాను.

"ఇంతలో సర్వర్‌తో 'రెండు బాదాం ఖీర్' అన్నాడు! దాంతో నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. నాకు కాఫీయే కావాలి; లేకపోతే నాకు తలనొప్పి వస్తుం' దన్నాను. 'అబ్బా! ఏం సాగదీయించుకుంటావురా! ఈ ఒక్కపూటకేగా, బాదాంఖీర్ రుచిమాడు.

రోజూ తాగుతూనే వుంటావుగా వెధవకాఫీ?'- ఇదీ వరస! వాడినోటికి జడిచి మెదలకండా ఊరుకున్నాను!

"బిల్లు నేను చెల్లిస్తూ కూడా పీడిచేత, నిన్న వాడు చెల్లించినప్పటికంటె ఘాటింపు మాటలు పడ్డా నేమిటా అని మనసంతా చాలా చిరాకుగా ఉంది. వెంకటశాస్త్రి నెమ్మదిగా బాదాంఖీర్ తాగుతూ కాలయాపన చేస్తున్నాడు. ఈ సినవ వేషం గమనించి నేను ధీమాగా కౌంటరు ముందుకి నడిచి జేబులో చూసుకుంటే పర్సు లేదు! కొయ్యబారిపోయాను.

"వెంకటశాస్త్రి సగం తాగిన గ్లాసు టేబులు మీద పెడుతూ 'ఒరేయ్! ప్రజ్ఞ కెందుకు పెనగులాడతావ్ కాని, నేను ఇస్తున్నాగా. రా! అందాకా ఏలా వచ్చి కూచో!' అన్నాడు.


"అంత దెబ్బతో పర్సు కనబడక తల దిమ్ముగాఉన్న నాకు పీడి మాటలు శూలాల్లాగా గుచ్చుకుంటున్నై. హోటల్లో వాళ్ళంతా నావైపే చూస్తున్నట్లనిపించింది. 'నిజంగారా! ఒకటీ రెండూ కాదు. చాలా డబ్బుందిరా పర్సులో. ఏమైందంట!' అన్నాను ఏమీ అనలేక. వెంకటశాస్త్రికూడా సానుభూతి చూపుతున్నట్లు 'నువ్విప్పుడు కొనవలసిన పెద్ద వస్తువులేమీ లేవుకదా, అంత డబ్బు బజారేమని తెచ్చావంట! పద! వెతుకుదాం...' అంటూ గ్లాసు ఖాళీచేసి బయలుదేరాడు. నేను హోటలు గుమ్మందాటాను. కాళ్లు చచ్చుపడిపోతున్నై. ఏమీ ఆలోచన పాలుపోవటంలేదు. వెంకటశాస్త్రి రెండుకిళ్లీలూ, సిగరెట్లూ తెచ్చి అగ్గిపుల్ల గీసి 'ఒరే అబ్బీ! ముందు నువ్వు అగరువత్తి అంటించు! నీ పర్సెక్కడికి పోతుందిరా. అసలు మనసొమ్ము పరాయివా డెవడన్నాతింటే జీర్ణం కావద్దట్రా!, నీడబ్బుకొచ్చిన భయ మేమీ లేదు. ఊఁ...పోగ పెల్చు!' అన్నాడు.

"ఈ వెకిలిమాటలు వినేసరికి కొస్త ప్రాణాలు చేరుకున్నై. ఇదేదో పీడి హస్తలాఘవమే నని ధైర్యం తెచ్చుకుని 'నీకు పుణ్యం ఉంటుంది. తీస్తే తీశానని చెప్పు, అనవసరంగా వేధించకండా' అని వాణ్ణి బతిమాలి బతిమాలి ప్రాణాలు పోతాయంటే నమ్మండి. ఎలాగైతేనేం చివరికి - ఎవరైనా ఎత్తుకుపోయి ఉండవలసిన పర్సుని తను దాచి జాగ్రత్తచేసినట్టు - నా అజాగ్రత్తకి మందలిస్తూ నా పర్సు నాకు పారేసి ఎవరో ఎదురయేసరికి వాళ్లతో ఉడాయించాడు.

"వచ్చి లెఖ్ఖచూసుకుంటే ఏముంది? మా హోటలు ఖర్చంతా దీనిలోది పెట్టాడు! నా డబ్బెట్టి తిని, నన్నెన్ని మాట లన్నాడో మాడు నక్షవసినుగ! ఇందాక హోటల్లో నన్ను హేళనగా చూసినవాళ్ళందరికీ ఈ శాస్త్రిగాడి చావు తెలివి ఏం తెలుస్తుంది? నన్ను ఉట్టి పరమజేవార్సుగా డనుకున్నారు...పెద్ద దాతలాగా ఎన్నిపోజులు పట్టాడు! నా డబ్బెట్టి తిని నన్నెన్నిమాట లన్నాడు!..."

పార్వతి ధోరణి ఆగేట్టు లేదు. మేమంతా వెక్కిరింపుగా నవ్వటం మొదలుపెట్టేసరికి వాడి తిట్లు మరీ ఎక్కువైనై. చివరికి వాసు అందుకుని "మహాఁ...నీ డబ్బెట్టి మీ రిద్దరూ తిన్నందుకే అంత లబలబ లాడతావేమిటి? నిన్న మీ రిద్దరూ వెంకటశాస్త్రి డబ్బుతో హోటలుకి పోయారన్నావే-నిజంగా ఆ డబ్బు ఎవరిదో తెలుసా? నాది! మొన్న - ఇవ్వాళ మీరిద్దరిలాగే - మే మిద్దరం హోటలుకి పోతే, ఇలాగే, నాపర్సుకూడా దాచి.. ఇవాళ నీ కిచ్చినట్టన్నా వెంటనే నాపర్సు నా కివ్వకండా,ఆ డబ్బుతోనే నిన్న నల్లా నిన్నుకూడా మేపి, ఇవ్వాళపొద్దున మిగిలిన డబ్బుతో నా పర్సు నా మొహాన పారేశాడు! నువ్వు నాకంటె అదృష్టవంతుడివే! అట్టే విచారించక మెదలకండా ఊరుకో" అన్నాడు!

అయితే, మీ కొక్క విషయం చెప్పాలి - వాసుమాటలు అంత తేలిగ్గా నమ్మకండి. వాసు చెప్పిన సంగతి.. పార్వతి ఇంతసేపూ ఈడ్చిగా చెప్పిన విషయాన్ని మించింది నాలుగుమాటల్లో చెప్పా ననిపించుకోవాలని కల్పించిన కట్టుకథ అయినా అయుండొచ్చు; లేదా వెంకటశాస్త్రి ఇప్పుడు పార్వతిగాడికి జరిపిన గౌరవమే వాడికి కూడా జరిపినా జరిపిఉండొచ్చు- ఈ రెండూ జరగతగ్గవే.



# తాళ్ళపాకవారి పదములు

## శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

### ౩.౨

అన్నమాచార్యుల రచన: (సం. ౩; ప. ౨౩)

భైరవి రాగం - ఝంపెతాళం

[పల్లవి]

(౧) ని ని గ రి సా , రి స ని ధా ప ధ ప ధ మ । ప ప ధ నీ రి సా , , ,
వ ని త భా గ్యం బు దే వ ర చి త్ర ము

(౨) ని ని మ గ రీ సా రి గ రి స ని ధ పా పా ధ ని ధా మా । ప ప ధ ని స రి గా , రి సా , , ,
వ ని త భా గ్యం బు దే వ ర చి త్ర ము

(౩) స ని రి స గ రి ని స రీ గ రి సా రి స ని ని ధ ప మ గ రి గ । మ ప ధ ని స రీ గా రి సా , , ,
వ ని త భా గ్యం బు దే వ ర చి త్ర ము

(౪) ని ని మ గ రి సా రీ ని సా ప ప మ గ రి గ । ,, ,, సా సా స ప
వ ని త భా గ్యం బు దే ,, ,, ము మా కు

(౧) ప ప రి స ని ధా ప మ ప గా రి రి ని సా । రి , , గ మ ప ద ప ధ మ ప ధ ని
ప ని గా దు ఇం క నీ పా దం బు లా న

(౨) ప ప రి స ని స ప ధ ప మ గ రి గ మ ప ధ ప మ గ రి ప । రీ , గ మ ప ధ నీ ధ ప
ప ని గా దు ఇం క నీ పా దం బు

(౩) ,, ,, ,, । గ గ రి స ని ని ధ ప గ మ గ రి స ని ధ ప మ ప ధ ని॥
పా దం బు లా న (వనిత)

[చరణం]

(౧) మ మ మా మ మా ప ధ ప మ గా రి । , రి గ రి గ మ ప ధ ని ప ధ మా పా ప
అ డ బా ల స తి బో న మా ర గిం చు మ టం చు

(౨) మ మా , మా , మ మా ప ధ ప మ గా రి । , రి గ మ ప ధ ని స ని ప ధ మా పా ప
అ డ బా ల స తి బో న మా ర గిం చు మ టం చు

ధ ప గ మ ప మ గ ప మ మ ప గా రి । గ రి గా మ ప ధ పా , , ,
బ డి బ డి ని క డు వి న్న ప ము సే య గ

పా ధ ని ప ధ ధ మ ప ధ నీ రి సా । ని ని ని మ గా రీ ని ని రి స ని ధా ప
ఈ డు గ ని ప రా కు న ఉం డి నె చ్చె లి మీ ద

ని ని ని ని ని ని ని స ని ధ ప । పా , స సా , ప ప మ గ రి గ మా పా ధ ని
బ డ లి వో ర గి న ది నీ పా దం బు లా న ॥ (వనిత)

ఇట్లె క్రింది చరణములు:

(౨) అడపంబు పతి పీడె - మవధరింపు మటంచు
అడరి కప్పురపుబలు - కందియ్యగా,
కడగంట జూడ దిదె - కాంతాళమో మఱపొ!
పడతి యిప్పుడు నీ - పాదంబులాన॥ (వనిత)

(౩) ఆలవట్టము విసరు - నతివలను వల దనదు;
పాలిండ్లపై కొంగు - పచరించదు;
ఏలా గౌనో వేంక - టేశ నీ విపు డిట్టె
పాలించకున్న నీ - పాదంబులాన॥ (వనిత)

లఘుటీక: మాకు బనిగాదు=మా శక్తిని మీఱినది; అడబాల సతి=వంటలక్క. 'అడు' ధాతువు 'వండు' అనే అర్థంలో తెలుగులో లేదు. కన్నడమున నున్నది. దానిపై వళ్ళ-వళ-వాళ-బళ-ప్రత్యయములు కర్త్రర్థమున ఆ భాషలో వచ్చును. 'అడబళ' తెలుగులోనికి వచ్చి 'అడబాల' అయినది. సంస్కృత'బాల' ఇందు లేదు. ఇట్టిది కన్నడ 'మడివాళ' తెలుగులో మడివాలు; బోనము=భోజనము; బడిబడిని=వెంటవెంటనే; అడపంబు=తిత్తి-వక్కలాకులది; అడరి=ముందుపడి; కాంతాళము=ఉదాసీనత. కాతాళ మనియు రూపము. కాతరశబ్దభవముగా 'కాతళ' కన్నడమందు గలదు. కాంతారశబ్దభవమైనా కావచ్చును. గర్వము, అసూయ, కోపము, విఱ్ఱీగు-ఇత్యాదిచ్ఛాయార్థములు దీనికి సంక్రమించినవి; ఆలవట్టము=తాళవృంతము-విసనకఱ్ఱ.

ముద్రిత పాఠములు: బడిబడినీకడు, కొంగుసవరించదు.